# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 223 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 16 జులై 2026 | పేజీలు :4




## ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతే ప్రధాన లక్ష్యం

- జనగామ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి

3




2 లో

బాబాయ్ బాండ్లు కొంటున్నాడు.. అబ్బాయ్ షేర్లు కొంటున్నాడు... మరి.. ఇద్దరిలో గెలుపెవరిది? సంపద సృష్టికి బాండ్లు కరెక్టా? షేర్లు సరైన నిర్ణయమా? మనం వేటికి ఓటేయాలి? దేనిని ఫాలో కావాలి? చాలా మందిని ఈ సందేహాలు వెంటాడుతూ ఉంటాయి. ఏది సంపదను పెంచుతుంది? ఏది స్థిరత్వాన్ని ఇస్తుంది? ఫైనల్‌గా దేనిని ఫాలో కావాలి? అనే సందిగ్ధం నూటికి 90 మందిలో ఉండటం సహజం. మరోవైపు.. కాలం మారుతోంది. డబ్బు రూపం మారుతోంది. ఉద్యోగాలు రూపాంతరం చెందుతున్నాయి. వ్యాపారాలు అప్‌డేట్ అవుతున్నాయి. మరి.. మన డబ్బు మన కోసం ఎప్పుడు పని చేస్తుంది? ఈ సందిగ్ధాలను ఈరోజు ఆర్థిక అభిమన్యులు సిరీస్‌లో దూరం చేసే ప్రయత్నం చేద్దాం..



## భోజనం, చదువు, క్రీడలు విద్యార్థి దినచర్యగా ఉండాలి

- సాధన ద్వారానే మంచి భవిష్యత్
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కేజీబీవీ విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించిన కలెక్టర్

2





| (EMI Schedule) 100 Sq.yards @ 4599/- | | |
|---|---|---|
| Plot Enrolment | 20,000 | - |
| Plot Booking | 1,00,000 | 7 Days |
| Plot Allotment | 1,30,000 | 15 Days |
| 30 Months EMI x 7000 | 2,10,000 | 30 Months |
| Total Amount | 4,60,000 | |



బాబాయ్ బాండ్లు కొంటున్నాడు.. అబ్బాయ్ షేర్లు కొంటున్నాడు... మరి.. ఇద్దరిలో గెలుపెవరిది? సంపద సృష్టికి బాండ్లు కరెక్టా? షేర్లు సరైన నిర్ణయమా? మనం వేటికి ఓటేయాలి? దేనిని ఫాలో కావాలి? చాలా మందిని ఈ సందేహాలు వెంటాడుతూ ఉంటాయి. ఏది సంపదను పెంచుతుంది? ఏది స్థిరత్వాన్ని ఇస్తుంది? ఫైనల్‌గా దేనిని ఫాలో కావాలి? అనే సందిగ్ధం నూటికి 90 మందిలో ఉండటం సహజం. మరోవైపు.. కాలం మారుతోంది. డబ్బు రూపం మారుతోంది. ఉద్యోగాలు రూపాంతరం చెందుతున్నాయి. వ్యాపారాలు అప్‌డేట్ అవుతున్నాయి. మరి.. మన డబ్బు మన కోసం ఎప్పుడు పని చేస్తుంది? ఈ సందిగ్ధాలను ఈరోజు ఆర్థిక అభిమన్యులు సిరీస్‌లో దూరం చేసే ప్రయత్నం చేస్తాను.

## ఆర్థిక అభిమన్యులు

# సంపద సర్వర్లలోకి మారుతోంది!

### రైల్లో సంభాషణ :

విజయవాడ రైల్వే స్టేషన్. సమయం సాయంత్రం 6 గంటలు. హైదరాబాద్ వెళ్లే రైలు కోసం ప్లాట్‌ఫామ్ మీద ప్రయాణీకులంతా ఎదురుచూస్తున్నారు. రైలు రాగానే రిజర్వేషన్లు ఉన్నవాళ్లు ఎవరి సీట్లు వాళ్లు వెతుక్కొని కూర్చుంటున్నారు. అలా.. ఇద్దరు వ్యక్తులు ఎదురెదురు సీట్లలో కూర్చున్నారు. ఒకరేమో... 55 సంవత్సరాల వయసున్న రామమూర్తి బాబాయ్. ప్రభుత్వ ఉద్యోగి. మరో రెండేళ్లలో రిటైర్మెంట్ కాబోతున్నాడు. మరొకరేమో.. 28 సంవత్సరాల వయసున్న వెంకట్. హైదరాబాద్‌లో ఐటీ ఎంప్లాయ్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా, స్టార్టప్‌లు, డిజిటల్ ఎకానమీ గురించి చాలా ఇంట్రస్ట్ మనోడికి. రామమూర్తి బాబాయ్‌ని చూడగానే.. బాబాయ్.. బాగున్నావా? కులాసాయేనా? అందరూ బాగున్నారా? వెంట వెంటనే ప్రశ్నలు సంధిస్తున్నాడు వెంకట్. అతను అడిగే ధాటికి పక్కన ఉన్నవాళ్లు కాస్త ఆశ్చర్య పోతున్నారు. కానీ, బాబాయ్ అతన్నేమీ విసుక్కోలేదు. ఎందుకంటే.. ఇద్దరూ బంధువులే. బాగున్నానబ్బాయ్.. నువ్వేంటీ ఇంటికొచ్చి వెళ్తున్నావా? అని ఎదురు ప్రశ్న వేశాడు. అవును బాబాయ్ అని వెంకట్ సమాధానం. ఇద్దరూ సంపాదిస్తున్నారు. అయితే, డబ్బు గురించి వాళ్ల ఆలోచనలు మాత్రం రెండు వేర్వేరు ప్రపంచాలుగా చెప్పుకోవచ్చు.

రైలు కదిలింది. వెంకట్ మాటలు కలిపాడు. ఏంటి బాబాయ్? రిటైర్‌మెంట్ ప్లాన్లేంటి? సర్వీసు దగ్గరికొచ్చినట్టుందే? అన్నాడు. అవునబ్బాయ్... రెండేళ్లలో రిటైర్ మెంట్. నేను బాండ్లు కొంటున్నాను.. రామమూర్తి బాబాయ్ గర్వంగా చెప్పాడు. ఈ మధ్య నా PF డబ్బులో నుంచి కూడా కొంత భాగం తీసి గవర్నమెంట్ బాండ్లలో పెట్టాను. అన్నాడు.

అర్జున్ నవ్వుతూ.. 'నేనయితే ఈక్విటీ ఫండ్లు కొంటున్నాను బాబాయ్.' అనగానే.. బాబాయ్ వెంటనే రెస్పాండ్ అయ్యాడు. 'షేర్లా? అవి చాలా డేంజర్ కదా.. మార్కెట్ పడిపోతే ఎలా? డబ్బు పోతే కష్టం కదా? నేను మాత్రం ఇలాంటివి పెట్టుకోదలచుకోలేదబ్బాయ్..' ప్రశాంతంగా నిద్రపోవాలి. అన్నాడు. ఇక, అర్జున్ సైలెంట్ అయ్యాడు. కానీ, అతని మనసులో మాత్రం ఒక ప్రశ్న మెదులుతోంది. 'గెలుపు అంటే అసలు ఏంటి? అనే ఆలోచనలో మునిగిపోయాడు.



రెండు తరాలు... రెండు ఆలోచనలు...

రామమూర్తి బాబాయ్ పెరిగిన కాలం వేరు. అప్పుడు.. బ్యాంకు FD అంటే భద్రత. ప్రభుత్వ ఉద్యోగం అంటే స్టెబిలిటీ. ఇల్లు అంటే సంపద. బంగారం అంటే భవిష్యత్తు. కానీ, అర్జున్ పెరిగిన కాలం వేరు.అతను తన కళ్లముందే చాలా చూశాడు. చూసింది... నోకియా అప్‌డేట్ కావడం ఆలస్యమైంది. ఫలితంగా కుప్ప కూలిపోయింది. అలాగే, కోడాక్ కూడా కొత్త టెక్నాలజీని పూర్తిగా పక్కన బెట్టింది. తను దశాబ్దాలుగా నమ్మిన టెక్నాలజీనే సర్వస్వం అనుకుంది. ఫలితంగా అది పూర్తిగా మాయమైపోయింది. బ్యాంకుల్లో ఫిజికల్ అటెండెన్స్, క్యూలలో నిల్చోవడం, గంటల తరబడి వేచిచూడటం అదృశ్యమైంది. ఇప్పుడు డిజిటల్ బ్యాంకింగ్ వచ్చి చేరింది. అరచేతిలోంచే బ్యాంకింగ్ పనులన్నీ కంప్లీట్ చేసుకోగలుగుతున్నాం. ఇక, అన్నింటికీ మించి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ AI) ప్రపంచాన్నే మార్చేస్తోంది. దేశాలు కాకుండా.. సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయి. అందుకే వెంకట్ ఒక విషయం అర్థం చేసుకున్నాడు. 'సంపద కేవలం భూముల్లో మాత్రమే లేదు.. సంపద సర్వర్లలోకి ట్రాన్స్‌ఫర్ అయ్యింది'.

1995లో చూస్తే.. అప్పట్లో అత్యంత విలువైన ఆస్తి భూమి. అదే.. 2025లో చూస్తే.. ఆప్షన్లు బదలాయించబడ్డాయి. డేటా, సాఫ్ట్‌వేర్, అల్గారిథమ్‌లు, క్లౌడ్ సర్వర్లు, AI మోడళ్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు. ఒకప్పుడు మన ముందుతరం వాళ్లు భూములు కొన్నారు. ఇప్పుడు పెట్టుబడిదారులు కంపెనీలను కొంటున్నారు. టెక్నాలజీని సొంతం చేసుకుంటున్నారు. ఆ కోణంలోనే.. అప్పటి తరానికి చెందిన రామమూర్తి బాబాయ్.. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా FD చేస్తున్నాడు. కొంత బంగారం కూడబెడుతున్నాడు. కొంత పెట్టుబడి బాండ్లలోకి మళ్లిస్తున్నాడు. అతని మైండ్‌సెట్ ప్రకారం అతని లక్ష్యం ఏంటంటే.. డబ్బు సురక్షితంగా ఉండాలి. మరి.. ఇప్పటి తరానికి చెందిన అబ్బాయ్ వెంకట్ తనదైన ట్రెండ్‌లో ముందుకు సాగుతున్నాడు. మ్యూచువల్ ఫండ్ లలో SIP చేస్తున్నాడు. ఈక్విటీ ఇండెక్స్ ఫండ్లు కొంటున్నాడు. దీర్ఘకాలిక పెట్టుబడులు పెడుతున్నాడు. వెంకట్ మైండ్‌సెట్ ప్రకారం అతని టార్గెట్ డబ్బు పెరగాలి. వాళ్ల సేవింగ్స్ వయసును బట్టి చూస్తే.. 20 సంవత్సరాల తర్వాత బాబాయ్ ప్రశాంతంగా ఉన్నాడు. అబ్బాయ్ కూడా సంపన్నంగానే ఉన్నాడు. అంటే ఇద్దరి దారులు వేరైనా.. టార్గెట్ ఒకటే. కాస్తంత తేడా అంతే.. ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. చుకోవాలి.బాబాయ్ తప్పు చేయలేదు. అబ్బాయ్ కూడా పొరపాటేమీ చేయలేదు. ఇద్దరూ సరైన విధంగానే ఆలోచించారు. వాళ్ల వాళ్ల టార్గెట్ మేరకు సంతృప్తికరంగానే రీచ్ అయ్యారు. ఇద్దరూ సంతోషంగానే ఉన్నారు.

### ఈక్విటీ - బాండ్ తేడా ఏంటి? :

చాలామందికి ఈక్విటీ అంటే జూదం మాదిరిగా అనిపిస్తుంది. ఈ అపోహ చాలామందిలో ఇప్పటికీ తిరుగుతోంది. కానీ, అది నిజం కాదు. పాజిటివ్‌గా ఆలోచిస్తే.. ఈక్విటీ అంటే దేశ అభివృద్ధిలో భాగస్వామి కావడం. మీరు ఒక కంపెనీ షేర్ కొన్నారంటే.. ఆ కంపెనీలో చిన్న భాగాన్ని కొనుగోలు చేసినట్టే. ఆ కంపెనీ సంపద పెరిగితే మీ సంపద కూడా పెరుగుతుంది. దేశం అభివృద్ధి చెందితే మీ పెట్టుబడి విలువ కూడా పెరుగుతుంది. మరి.. బాండ్ అంటే ఏంటి? బాండ్‌లో మీరు యజమాని కాదు. అప్పు ఇచ్చే వ్యక్తి. ప్రభుత్వానికి లేదా కంపెనీకి బాండ్ల రూపంలో డబ్బును అప్పుగా ఇస్తారు. దానికి ప్రతిఫలంగా మీరు పెట్టుబడులు పెట్టిన బాండ్ విలువ ఆధారంగా వడ్డీ వస్తుంది. అందుకే.. ఈక్విటీ మీకు సంపదలో వేగం పెంచుతుంది. అంటే.. వేగంగా ప్రతిఫలాన్ని ఇస్తుంది. అదే.. బాండ్ చూస్తే.. మీకు స్థిరత్వాన్ని ఇస్తుంది. ప్రతిఫలం తక్కువైనా గ్యారెంటీ ఉంటుంది. ప్రశాంతంగా ఉండొచ్చు.

### అపోహలకు అత్యుత్సాహమే కారణం

వెంకట్ ఫ్రెండ్ ఒకతను చేసిన పొరపాటు సాధారణంగా ఈక్విటీ ఫండ్లపై అపోహలను మరింత పెంచింది. వెంకట్‌కు ఒక స్నేహితుడు ఉన్నాడు. పేరు వికాస్. అతను సోషల్ మీడియాలో ఒక వీడియో చూశాడు. షేర్లతో త్వరగా కోటీశ్వరుడు అవ్వండి. అనేది దాని క్యాప్షన్. అంతే... వెనుకా ముందూ ఆలోచించలేదు. అతను SIP చేయలేదు. దీర్ఘకాలిక పెట్టుబడి పెట్టలేదు. ఆ వీడియో ప్రభావంతో వికాస్ ట్రేడింగ్ మొదలుపెట్టాడు. ఎక్కడ ఏ వీడియో చూసినా, ఎవరు ఏ సలహా ఇచ్చినా మార్చుకుంటూ పోయాడు. కొనడం, అమ్మడం చేశాడు. రెండు సంవత్సరాల తర్వాత చూస్తే.. వికాస్ పెట్టుబడి పెట్టిన డబ్బు తగ్గింది. తగ్గింది కేవలం అతని డబ్బు మాత్రమే కాదు.. వికాస్ ఆత్మవిశ్వాసం కూడా తగ్గిపోయింది. అప్పుడు అతను ఒక ఆలోచనకు వచ్చాడు. 'షేర్ మార్కెట్ అంటేనే మోసం'. కానీ, నిజానికి మార్కెట్ తనను మోసం చేయలేదు. అతని తొందరపాటే అతన్ని మోసం చేసింది.

### పొరపాటు ఎక్కడ ఉంది? :

రామమూర్తి బాబాయ్ మొదటినుంచీ FDలనే నమ్ముకున్నాడు. బాండ్లలోనే పెట్టుబడులు పెట్టాడు. ఫలితంగా బాబాయ్ తన డబ్బును ఏమీ కోల్పోలేదు. కానీ.. ఒక అవకాశం కోల్పోయాడు. ఫలితంగా ద్రవ్యోల్బణం బారిన పడ్డాడు. రామమూర్తి బాబాయ్ డబ్బు పెరిగింది. కానీ, వస్తువుల ధరలు ఇంకా ఎక్కువగా పెరిగాయి. వేగంగా పెరిగాయి. అంటే.. కొనుగోలు శక్తితో చూసుకుంటే తన డబ్బు విలువ తగ్గింది. మరి.. వీటన్నింటినీ బేరీజు వేసుకుంటే.. అసలు గెలుపు ఎవరిది? ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. గెలిచింది బాబాయ్ కాదు. గెలిచింది అబ్బాయ్ కూడా గెలిచింది బ్యాలన్స్ అంటే.. డబ్బు బ్యాలన్స్ కాదు.. సమతుల్యత. యవ్వనంలో ఈక్విటీలో ఎక్కువగా దృష్టి పెట్టాలి. ఎందుకంటే సమయం ఎక్కువ ఉంటుంది. సహనంతో నిర్ణయాలు తీసుకోవాలి. వయసు పెరిగేకొద్దీ బాండ్లలో పెట్టే పెట్టుబడుల వాటా పెరగాలి. ఎందుకంటే జీవితంలో క్రమంగా స్థిరత్వం అవసరం అవుతుంది. దీనిని బట్టి ఒక జీవిత చక్రంలో చూసుకుంటే.. 25 సంవత్సరాల వయసులో 90% ఈక్విటీలో పెట్టుబడులు పెడితే.. 10% డెట్‌లో డబ్బు పెట్టాలి. అదే.. 40 సంవత్సరాల వయసులో... 70% ఈక్విటీలో పెడితే.. కనీసం 30% డెట్‌లను నమ్ముకోవాలి. ఇక, 55 సంవత్సరాల వయసులో చూసుకుంటే.. 40% ఈక్విటీలకు, 60% డెట్‌లకు పెట్టుబడులను సర్దుబాటు చేసుకోవాలి. చివరగా.. రిటైర్మెంట్ తర్వాత ఆదాయం కోసం బాండ్లపై పూర్తిగా ఆధార పడేలా ఉండాలి. సంపద వృద్ధి కోసం కొంత వరకు మాత్రం ఈక్విటీలను కంటిన్యూ చేయొచ్చు.

### చివరి జీతం తర్వాత?

ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరూ.. తనకు వచ్చే చివరి జీతం తర్వాత పరిస్థితి ఏంటన్నది ముందుగానే మానసికంగా, ఆర్థికంగా సిద్ధమై ఉండాలి. కాస్త ముందు నుంచే ఈ అంశం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంటుంది. తమ జీవితంలో ఒకరోజు.. చివరి జీతం వస్తుంది. ఆ మరుసటిరోజు నుంచి? మీరు అప్పటిదాకా పనిచేసిన ఆఫీసు మీకు జీతం ఇవ్వదు. ఏదో అవసరం కోసమో, ఆఫీసు పనికోసమో బాస్ కాల్ చేయడు. ప్రతినెలా మాదిరిగా తనకు జీతం వచ్చిందన్న శాలరీ SMS రాదు. అప్పుడు.. మీరు అంతకుముందు పెట్టిన పెట్టుబడులే మీకు జీతం ఇచ్చే ఉద్యోగ సంస్థగా మారాలి. అక్కడే మీకు బాండ్ల అసలు శక్తి కనిపిస్తుంది. చివరి జీతం తర్వాత బాండ్లు మీకు జీతం ఇవ్వగలుగుతాయి.

### సర్వర్లలోకి మారుతోన్న సంపద

ఈరోజు ప్రపంచంలోని అతి పెద్ద కంపెనీలను గమనిస్తే.. వాటి విలువలో ఎక్కువ భాగం భూములు కాదు.. ఫ్యాక్టరీలు కూడా కాదు.. డేటా, సాఫ్ట్‌వేర్, నెట్‌వర్క్, క్లౌడ్, చివరగా AI. వీటిని పరిశీలిస్తే.. సంపద భౌతిక వస్తువుల నుంచి డిజిటల్ ఆస్తుల వైపు పరుగులు పెడుతోంది. ఈ మార్పులో భాగం కావడానికి మనం కూడా యజమానులుగా మారాల్సిన అనివార్యత ఉంది. అందుకే.. దీర్ఘకాలిక ఈక్విటీ పెట్టుబడులు అవసరం అవుతాయి. చివరగా రైలు హైదరాబాద్ సమీపిస్తోంది. అప్పటిదాకా సాగిన పిచ్చాపాటి మాటలు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన చర్చలు చివరిదశకు చేరుకున్నాయ్. రైలు ప్రయాణం ముగిసే సమయానికి.. రామమూర్తి బాబాయ్ ఒక ప్రశ్న అడిగాడు. అబ్బాయ్ వెంకట్.. ఇప్పుడు నువ్వు చెప్పినవి, విశ్లేషించినవి అన్నీ చూసుకుంటే నేను తప్పు చేశానా? అని సందేహం వ్యక్తం చేశాడు. 'లేదు బాబాయ్'.. అన్నాడు వెంకట్ వెంటనే.. 'మీరు సంపదలో భద్రత నేర్పించారు. మా తరం దానిని ఎలా వృద్ధి చేయాలో నేర్చుకుంటోంది. మీరు నేర్పించిన బాండ్లు మాకు స్థిరత్వాన్ని నేర్పించాయి. మాతరం అలవాటు పడ్డ ఈక్విటీలు మాకు అవకాశాలు చూపించాయి. ఇద్దరం కలిస్తేనే పూర్తి ఆర్థిక విజయం.' వివరంగా తాను గ్రహించిన విషయాలు చెప్పాడు. 'అంటే గెలుపు నాది కాదంటావా అబ్బాయ్..' మళ్లీ రామమూర్తి బాబాయ్‌లో సందేహం. 'ఎవరన్నారు బాబాయ్.. గెలుపు మన ఇద్దరిదీ...' అన్నాడు వెంకట్. అప్పటికి గానీ రామమూర్తి బాబాయ్ స్థిమితపడలేదు.

వీటిలో మనం కొన్ని ఆర్థిక సూత్రాలను నేర్చుకోవచ్చు. ఈక్విటీ సంపదను నిర్మిస్తుంది. అయితే, సమయం ఎక్కువ అవసరం. దానికి సమయం ఇస్తే.. ఈక్విటీ మీ గొప్ప మిత్రుడుగా మారతాడు. అదేవిధంగా బాండ్లు మన సంపదను కాపాడతాయి. రిటైర్మెంట్ దగ్గర పడే కొద్దీ స్థిరత్వం విలువ పెరుగుతుంది. ఆర్థికంగా విజయం సాధించడానికి వేగం మాత్రమే కాదు.. అప్పుడప్పుడూ బ్రేకులు కూడా అవసరం. కారులో యాక్సిలేటర్ ఎంత ముఖ్యమో.. బ్రేక్ కూడా అంతే ముఖ్యం. ఈక్విటీ యాక్సిలేటర్ అనుకుంటే.. బాండ్లను బ్రేక్ మాదిరిగా భావించవచ్చు.

బాబాయ్ బాండ్లు కొంటున్నాడు.. అబ్బాయ్ షేర్లు కొంటున్నాడు.. గెలుపు ఎవరిది? అని ప్రశ్నించుకుంటే.. కాలాన్ని అర్థం చేసుకుంటూ ముందుకు సాగుతున్న వాళ్లది. ఎలాగంటే.. యవ్వనంలో వృద్ధిని ఎంచుకున్నవారిది. వృద్ధాప్యంలో స్థిరత్వాన్ని ఎంచుకున్నవారిది. ఎందుకంటే.. సంపదను సృష్టించేది ఈక్విటీ అయితే.. ఆ సంపదను కాపాడేది బాండ్లు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇచ్చేది మాత్రం ఈ రెండింటి బ్యాలన్స్. 'జీవితంలో ప్రతి దశకు ఒక ఆస్తి ఉంటుంది.. తెలివైన పెట్టుబడిదారుడు ఆ దశను గుర్తించి సరైన ఆస్తిని ఎంచుకుంటాడు..'



- అట్లూరి గణేష్, ఫైనాన్షియల్ ఎడ్యుకేటర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, రచయిత.

# భోజనం, చదువు, క్రీడలు విద్యార్థి దినచర్యగా ఉండాలి

- సాధన ద్వారానే మంచి భవిష్యత్
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కేజీబీవీ విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించిన కలెక్టర్



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని, అప్పుడే భవిష్యత్ కు మంచి మార్గం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం, జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) పరిధిలో గల కేజీబీవీని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. ముందుగా వంట గదిలోకి వెళ్లి, ఆర్వో ప్లాంట్, వంట సరకులను, సిద్ధం చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. అరటి పండ్ల నాణ్యత బాగాలేదని, శుభ్రమైన పళ్లను మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. గుడ్లు ఎప్పుడు వచ్చాయి అని అడిగి, నాణ్యతను నీళ్లల్లో వేసి కలెక్టర్ స్వయంగా పరీక్షించారు. ఆర్వో ప్లాంట్, సరకుల గదిని తనిఖీ చేసి, నిర్వహణ సరిగా లేదని, ధాన్యం బస్తాలు, సరకులు, యాసిడ్ లాంటి వస్తువులను ఏ విధంగా ఎక్కడ పెట్టాలో సూచించారు. డైట్ చార్ట్ ప్రకారం వంటలు చేశారా? లేదా? అని అడిగి, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? ఎన్ని కిలోల చికెన్ తెచ్చారని? కలెక్టర్ ఆరా తీశారు. కేజీబీవీ పరిసరాల చుట్టూ పారిశుధ్య నిర్వహణ బాగుండాలని, ఎలాంటి చెత్తచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. కంప్యూటర్ గదిని పరిశీలించి, విద్యార్థులకు వాటి ద్వారా ఏమేమి నేర్పిస్తున్నారు? అని కంప్యూటర్ ఆపరేటర్ ను అడిగి, కంప్యూటర్ విద్యపై ఆపరేటర్ కు ఉన్న సామర్థ్యాలను కలెక్టర్ పరీక్షించారు. అనంతరం 10వ తరగతిలో అన్ అకాడమీ తరగతులను ప్రారంభించి, ఫాస్ట్ మ్యాథ్స్, GET IT WRITE పుస్తకాల ప్రాధాన్యతను కలెక్టర్ విద్యార్థులకు వివరించారు. అందరికీ అన్ని అంశాలు తెలియదని, ప్రతిరోజూ చదివితే తెలియని అంశాల మీద పట్టు సాధించవచ్చన్నారు. ప్రతి పోటీ పరీక్షలో మ్యాథ్స్ తప్పనిసరిగా ఉంటుందని, ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకంలోని అంశాలను నేర్చుకుంటే గణితంలో ఉండే లెక్కల సాధన సులభతరమవుతుందన్నారు. యూట్యూబ్ వీడియోల కంటే అన్ అకాడమీ తరగతులు చాలా ఉపయోగపడతాయన్నారు. ప్రణాళికా ప్రకారంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్నీ బోధించాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఎస్ఓకు తెలిపారు.








## ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతే ప్రధాన లక్ష్యం

జనగామ, మన చౌరాస్తా : ప్రజల ప్రాణాల, ఆస్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుందని జనగామ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జనగామ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్, ఇంటి నెం. 622/47/B3/1 ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో సంబంధిత భవనాన్ని బుధవారం కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. ఈ పరిశీలనలో భవన నిర్మాణం, వినియోగంలో పలు నిబంధనల ఉల్లంఘనలను గుర్తించినట్లు తెలిపారు. నివాస గృహ నిర్మాణానికి అనుమతి పొందిన భవనాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు, భవనంలో కెనరా బ్యాంక్ శాఖ, డీసీసీ బ్యాంక్‌తో పాటు విద్యా సంస్థలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. అదే విధంగా స్టిల్ట్ ఫ్లోర్‌ను పార్కింగ్ నిబంధనలకు విరుద్ధంగా వినియోగించడం, తప్పనిసరిగా ఉండాల్సిన సెట్ బ్యాక్‌లను పాటించకపోవడం వంటి ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయన్నారు. భవన నిర్వహణలో నిబంధనలు పాటించకపోవడం వల్ల అగ్ని ప్రమాదానికి దారితీసే పరిస్థితులు ఏర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించిన అధికారులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని సంబంధిత భవన వినియోగాన్ని తక్షణమే నిలిపివేస్తూ చర్యలు చేపట్టామన్నారు. ఈ తనిఖీలో విద్యా శాఖ అదనపు డైరెక్టర్ కార్యాలయ ప్రతినిధులు, టిఎస్ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, జిల్లా ఫైర్ ఆఫీసర్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## సమాచార భవన్ వద్ద జర్నలిస్టుల ధర్నా

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ డిజిటల్ కేబుల్ టీవీ జనగామ జిల్లా అధ్యక్షుడు మరెడీ వినయ్ కుమార్ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TWJF) ఫెడరేషన్ ఆధ్వర్యంలో మసాబ్ ట్యాంక్ సమాచార భవన్ ఎదుట జర్నలిస్టులు చేపట్టిన ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో కాంట్రిబ్యూషన్ లేకుండా హెల్త్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్టీసీ, మెట్రోలో ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు రైల్వే పాసులను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ఘనపూర్ (స్టేషన్) ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గం పరిధిలో జరుగుతోన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. అనంతరం ఘనపూర్ (స్టేషన్) మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ఓటరు నమోదు ప్రక్రియను పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పనుల పురోగతిని వేగవంతం చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఓటరును చైతన్యపరిచి, ఎన్యూమరేషన్ ఫారాలు తప్పనిసరిగా నింపించి, బీఎల్‌వోలకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారాలను తిరిగి బీఎల్‌వోలకు సమర్పించకపోతే ఓటరు నమోదుపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రతి ఓటరు ఫారాలను తప్పనిసరిగా అందజేసి డిజిటలైజేషన్ పూర్తయ్యేలా చూడాలని ప్రజలకు కలెక్టర్ తెలిపారు.





## ప్లాస్టిక్ గోదాంలో భారీ అగ్ని ప్రమాదం

**మీర్‌పేట్, మన చౌరాస్తా :** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధి నందనవనంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మెట్రో బార్ సమీపంలోని ఓ ప్లాస్టిక్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చలరేగి వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న మరో గోదాంను, సమీప భవనంలోని ఇళ్లను కూడా ఆవరించాయి. స్థానికుల సమాచారం అందుకున్న వెంటనే మూడు అగ్నిమాపక వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై మీర్పేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# wanted

## విలేకరులు కావలెను




**మన చౌరాస్తా** తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**